
# పిచ్చి ముదిరింది!

**- తిరుమలశ్రీ**

**పిచ్చెక్కినవాడిలా జుట్టు పీక్కున్నాడు చలపతి. మరికొన్ని రోజులు పోతే పీక్కోవడానికి జుట్టుకూడా మిగలదు. ఎందుకంటే టీవీకి కేబుల్ కనెక్షన్ పెట్టినప్పట్నుంచీ అలా పీక్కుంటూనే వున్నాడు మరి!**

అసలు కారణమేమిటంటే చలపతి ఇంట్లో అందరికీ టీవీ పిచ్చి. పెళ్ళానికి సీరియల్సూ, టీనేజ్ కూతురికి యూత్ ప్రోగ్రామ్సూ, పదకొండేళ్ళ పుత్రరత్నానికి కామిక్సూ... ఆ పిచ్చికి అతీతుడు అతనొక్కడే.




ముఖ్యంగా ఆదివారం వచ్చిందంటే చాలు ఇల్లంతా అతలాకుతలంగా వుంటుంది. ఆఫీసు, స్కూలు, కాలేజీల ప్రెషర్స్ వుండవేమో చలపతి తప్ప ఇంట్లోని శాల్తీలన్నీ ప్రొద్దుపొడిచింది మొదలు అర్ధరాత్రి దాటేంతవరకూ టీవీ సెట్‌కి అతుక్కుపోతాయి.

ఏ రోజైనా చలపతికి కోపమొచ్చి విసుక్కుంటే చాలు "హు.. 'అమ్మ' లాంటి 'పిన్ని' మాట మీద 'నమ్మకం'తో 'మట్టిమనిషి' మా బావను కాదని, 'బంగారు బొమ్మ' లాంటి నేను మీకు 'ఇల్లాలు'నయ్యాను. మా 'అన్నయ్య', 'వదిన'ల మాట వినకుండా 'నాన్నకోసం' మీ చేత తాళి కట్టించుకున్నాను. 'స్నేహం'గా మెలగవలసిన 'భార్యాభర్తలు' ఆ 'పవిత్రబంధం' విస్మరించి అపార్థాలకు 'శ్రీకారం' చుట్టి 'ప్రియమైన శత్రువులు'గా మారిపోవడం దురదృష్టం. అంతా 'విధి' ఆడే 'చదరంగం' కాకపోతే ఈ 'సుడిగుండాలు'లో ఎందుకు చిక్కుకుంటాను? 'ఈనాటి రామాయణం' లో పావునెందుకవుతాను?" అంటూ టీవీ సీరియల్స్ పేర్లన్నీ దండగా కూర్చి దండకం చదివేసి ముక్కు చీదేస్తుంది భార్య పరిమళం. "హతవిధీ" అంటూ తల పట్టుకోవడం తప్ప గత్యంతరం వుండదతనికి.

కూతుర్ని కదపబోతే 'ష్' అంటుంది నోటి దగ్గర వేలు పెట్టుకుని. 'అదేమిటే?' అనడిగితే 'అదో వెరైటీ ప్రోగ్రాం. ఫ్యూచర్‌లో అందులో ఫీచరయ్యే ఛాన్స్ కోసం ఎదురు చూస్తున్నాను' నేను అని జవాబిస్తుంది అంజలి. తన 'సండే సందడిని' పాడు చెయ్యొద్దం టుంది. మళ్ళీ మాట్లాడితే 'ఆట కావాలా? పాట కావాలా?' అనడుగుతుంది. 'కొత్త సినిమా గురూ!' అంటూ టెమ్ట్ చేయబోతుంది. తల కొట్టుకుంటాడు చలపతి.

ఇక పుత్రరత్నం కిరణ్ సరేసరి. అమ్మతోటీ, అక్కతోటీ కరాటే చేసి మరీ కార్టూన్ నెట్‌వర్క్‌ని 'నెట్' చేస్తాడు. 'టామ్ అండ్ జెర్రీ' స్థాయి నుంచి ఇంకా ఎదగలేదు వాడు. చదువు పాడవుతుందిరా అంటే చదువులో ర్యాంకు రాకపోయినా ఫరవాలేదుగానీ, టీవీలో ఫలానా కామిక్ స్ట్రిప్ చూళ్ళేదంటే మా ఫ్రెండ్సంతా ఫీలవుతారు డాడీ! అంటూ ఇన్నోసెంట్‌గా ఫేస్ పెట్టి మరీ చెబుతాడు. వాడి బుర్ర పగులగొట్టాలన్నంతగా వొళ్ళు మండినా, తన వంశోద్ధారకుడు వాడేనన్న వాస్తవం గుర్తుకు రావడంతో చేసేది లేక తన నెత్తిమీదే వాయించుకుంటాడు చలపతి.

ఓసారి చిరకాల మిత్రుడొకడు చాన్నాళ్ళ తరువాత చలపతిని చూడ్డానికి వూడిపడ్డాడు. అదే సమయంలో చలపతి వారం రోజులుగా క్యాంప్‌లో వుండడం జరిగింది. డోర్ బెల్‌కి రెస్పాన్స్ లేకపోవడంతో వోరగా తెరిచున్న తలుపును తోసుకుని లోపలికి వెళ్ళాడు ఆ మిత్రుడు. హాల్లోని ఆ దృశ్యం అతన్ని తికమక



## వెండితెర పైకి సైఫ్ అలీ కూతురు!

సైఫ్ అలీఖాన్, అమృతాసింగ్‌ల కూతురు హీరోయిన్‌గా వెండితెరపైకి రానుందని బోగట్టా! షర్మీలా ఠాగూర్ వారసుడిగా తెరంగేట్రం చేసిన సైఫ్ అలీ చెల్లెలు ఇటీవలే బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది. తనకిష్టం లేకపోయినా చెల్లెలి నిర్ణయానికి తలాడించిన సైఫ్ ఇప్పుడు తన కూతురూ అదే బాటలోకి అడుగు పెట్టాలని ఉవ్విళ్ళూరుతుండడం పట్ల ఎలా స్పందిస్తాడో!?

---

పెట్టింది. తాను కరెక్ట్ ఎడ్రెస్‌కే వచ్చానా అన్న సందేహం కలగడంతో డైరీ తెరిచి చూసుకున్నాడు. ఎడ్రెస్ సరిగానే వుంది. హమ్మయ్య పొరపాటున వేరే కొంపకు వచ్చానేమో నని భయపడ్డాను అనుకుని గుండెల నిండా వూపిరి పీల్చుకున్నాడు. గుండెలయితే తేలిక పడ్డాయి గానీ, మెదడు మాత్రం మొద్దుబారి పోయింది ఆ దృశ్యం చూస్తుంటే.

హాల్లో టీవీ మోగుతోంది. దానికెదురుగా చలపతి భార్య, కూతురు, కొడుకు సోఫాలో కూర్చుని ప్రోగ్రాం చూస్తున్నారు. వారికి కాస్త ఎడంగా పనిమనిషి కాబోలు నేల మీద కూర్చుంది. ప్రేక్షకుల్లో ఎక్కడా చలనం లేదు. ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టు రెప్పలు కూడా ఆడించకుండా కళ్ళను టీవీ సెట్‌కి ట్రాన్స్‌ఫిక్స్ చేసేశారు. లక్క బొమ్మల్ని సోఫాలో కూర్చోబెట్టినట్టుంది వారిని చూస్తే. వారి తలలపైన, భుజాలపైన సాలెగూళ్ళు, కందిరీగలు గూళ్ళు కట్టి వున్నాయి. కింద కూర్చున్న పనిమనిషి స్థితీ అందుకు భిన్నంగా లేదు. ఇల్లంతా చిందరవందరగానే కాక ధూళి ఎన్నాళ్ళనుంచో తుడవనట్లుంది. వాళ్ళంతా ఎన్నాళ్ళనుంచి అలా వున్నారో? అనుకుని విస్తుపోయాడు.

ఆ దృశ్యం ఒకింత భీతిగొల్పినా, ధైర్యం చేసుకుని తన రాకను ప్రకటించబోయాడతను. ప్రయోజనం శూన్యం. చలపతీ! అంటూ ఎలుగెత్తి పిలిచాడు. వారి దృష్టినాకర్షించుకునేందుకని చప్పట్లు కొట్టాడు. హు లాభం లేకపోయింది. గంట సుమారుగా వివిధ ప్రక్రియలతో ప్రయత్నించినా ఒక్కరిలోనూ చలనం లేదు. ఏదో అనుమానం వచ్చి కుర్రాడి ముక్కు దగ్గర వేలుపెట్టి చూశాడు ఆడవాళ్ళ ముక్కుల దగ్గర పెడితే బావుండదని. ఊపిరి పీల్చుతున్నట్టు అనిపించ లేదు. హఠాత్తుగా అనిపించిందతనికి - కొంపదీసి నేను ఘోస్ట్ హౌస్‌కి రాలేదు గదా? అని అంతే ఒక్క అంగలో బయటికురికాడు. బ్రతికుంటే చలపతిని చచ్చేలోపున ఎప్పుడైనా కలుసుకో వచ్చునని.

తరువాత స్నేహితుడి ఉత్తరం ద్వారా ఆ ఎపిసోడ్ గురించి తెలుసుకున్న చలపతి నెత్తీ, నోరూ బాదుకున్నాడు.

ఆ రోజు ఆదివారం. ఏదో ఛానెల్ వాళ్ళు తమ యూత్ ప్రోగ్రాంలో ఆడియన్స్ కోసం ఎడ్వర్‌టైజ్ చేస్తే వెళ్ళింది అంజలి, కిరణ్ ఫ్రెండ్స్‌తో కలిసి తన ఫేవరైట్ హీరో కొత్త సినిమా రిలీజ్‌కి చెక్కేశాడు. ఇంట్లో చలపతి, అతని భార్య ఇద్దరే వున్నారు.

ఆ సమయంలో నలుగురు ఆగంతకులు హడావుడిగా చొరబడ్డారు. చలపతి కంగారు పడి దొంగలు అని అరవబోతే అర్జెంటుగా అతని నోరు నొక్కేసి, "మేం దొంగలం కాం. టీవీ ఛానెల్ నుంచొస్తున్నాం" అన్నారు. తమలో ఒకరు డైరెక్టరనీ, ఇంకొకరు అతని అసిస్టెంటనీ, మరొకరు రైటరనీ, నాలుగోవాడు ప్రొడ్యూసరనీ పరిచయం చేసుకున్నారు.

"బుడి బుడి దుఃఖాలు" వీక్లీ సీరియల్ తరువాత ఎపిసోడ్ షూటింగ్ తమ ఇంట్లో తీయదలచుకుంటున్నారని చెప్పగానే ఎగిరి గంతేసింది పరిమళం. అదంతా ఇష్టంలేని చలపతి నోరు తెరిచినప్పుడల్లా, చేత్తో అతని నోరు మూసేయడమే పనిగా పెట్టుకున్నాడు అసిస్టెంట్ డైరెక్టర్.

"మీ బుడి బుడి దుఃఖాలు సీరియలంటే పడి ఛస్తాను నేను" అంది పరిమళం డైరెక్టర్‌తో.

"మీలాగే ఆ సీరియల్ చూసిన మహిళలు చాలామంది పడకుండానే చచ్చారు" అన్నాడతను.

"టీవీలో కనపడాలన్న కోర్కె చాన్నాళ్ళుగా వుంది నాలో. దయచేసి మీ సీరియల్లో ఓ పాత్ర ఇస్తే పేరు చెప్పుకుంటాను" అంది పరిమళం అతని పేరు నోట్ చేసుకుంటూ.

వాళ్ళొకసారి ముఖాలు చూసుకున్నారు. "మీరు టీవీలో కనిపించాలి అంతేగా?" అన్నాడు డైరెక్టర్.

ఔనందామె హుషారుగా.

"ఓ.కే. షూటింగ్‌కి ఇల్లిస్తున్నారుగనుక మా సీరియల్‌లో మిమ్మల్నిద్దర్నీ చూపిస్తాం" అన్నాడు డైరెక్టర్.

ఎగిరి గంతేసిందామె. "చిన్నప్పుడు ఎలిమెంటరీ స్కూల్లో ఓ నాటకంలో పార్టిసిపేట్ చేశాను నేను. నాకు నటన వచ్చు" అంది.

"నటనకూ నాకు టీవీకీ రేడియోకీ వున్నంత దూరం" అన్నాడు చలపతి.

"ఫరవాలేదు. మా సీరియల్లోని హీరోయిన్ తల్లిదండ్రులు ప్లేన్ యాక్సిడెంటులో చచ్చిపోతారు. వారి ఫోటోలను గదిలో పెట్టుకుంటుందామె. సో, మీ ఫోటోలు పెట్టి దండ వేస్తాం" వివరించాడు రైటర్.

చలపతి అదిరిపడి, "వాడ్డూ యూ మీన్? సీరియల్లో కనిపించడమంటే అదా?" అన్నాడు తెల్లబోతూ.

"ఔను. సాధారణంగా ప్రముఖ నటీనటుల ఫోటోలు పెడతాం అటువంటి సన్నివేశాలలో. మీ మీద అభిమానం కొద్దీ మీవి పెట్టాలనుకుంటున్నాం. యు ఆర్ లక్కీ" అన్నాడు డైరెక్టర్ అతని భుజం తడుతూ.

చలపతి అభ్యంతరం చెప్పబోతే, మళ్ళీ చేత్తో అతని నోరు నొక్కేశాడు అసిస్టెంట్ డైరెక్టర్, తాను అందుకే అక్కడికి వచ్చినట్టు. పరిమళం ఆ ఛాన్సుకూడా ఎక్కడ పోతుందోనన్న భయంతో పొట్టు మీద పొట్టు వేసేసి భర్త అబ్జెక్షన్స్‌ని వోవర్ రూల్ చేసేసింది. ఏదో విధంగా ఆ పాపులర్ సీరియల్లో కనిపించాలన్న ఉబలాటం ఆమెది.

"ఎల్లుండే షూటింగు. ఆ షెడ్యూల్లో హీరో హీరోయిన్లు పాల్గొంటారు" అన్నాడు డైరెక్టర్. "హీరోయిన్ బెడ్‌రూమ్‌గా ఏ గది బావుంటుందో చూడాలి. ఇల్లంతా సర్వే చేసి పాత్రల మువ్‌మెంట్సునీ ప్లాన్ చేసుకోవాలి. అంతవరకూ మమ్మల్ని డిస్టర్బ్ చేయకుండా మీరు హాల్లో ఓ మూల కూర్చుంటే బావుంటుంది."

చేసేది లేక చలపతీ, హైస్పిరిట్స్‌లో వుండి పరిమళమూ ఇంటిని వాళ్ళకప్పగించేసి టీవీ ముందు సెటిలయిపోయారు.

"సమయానికి అంజలి ఇంటి దగ్గర

లేకుండా పోయింది. ఉన్నట్టయితే దాన్ని కూడా ఓ వేషం కప్పించేదాన్ని" అనుకుంది పరిమళం కూతుర్ని తలచుకుంటూ.

అదే సమయంలో అంజలి ఓ ఐస్‌క్రీం పార్లర్ దగ్గర తన స్కూటీనీ ఆపి, వెనీలాకి ఆర్డరిచ్చింది. ఆమె ఐస్‌క్రీమ్ తింటూంటే ఓ యువతి ఆమె దగ్గరకొచ్చింది. తెల్లగా, ఆకర్ష ణీయంగా వుందామె.

ఆమె తన మెడవంకే తదేకంగా చూస్తూంటే ఆశ్చర్యపోయి, "ఏమిటలా చూస్తు న్నారు?" అనడిగింది అంజలి.

"మీ మెళ్ళోని నెక్లెస్ చాలా బావుంది. ఇంతకు మునుపెప్పుడూ ఇలాంటి మోడల్ చూళ్ళేదు నేను" అందా యువతి.

"ఇది న్యూ మోడల్. లాస్ట్ మంత్ నా బర్త్ డేకి మా మమ్మీ కొంది" అంది అంజలి కించిత్తు గర్వంగా.

"నాకోసారిస్తారా, పెట్టుకుని ఆనందిస్తాను?" అందామె.

ఆమెవంక అనుమానంగా చూసి, "సారీ" అంది అంజలి.

ఆ యువతి విడిచిపెట్టలేదు. నెక్లెసివ్వమని అంజలి వెంట పడింది, ఆ పిల్ల విసుక్కుం టున్నా సరే. ఆమె వింత ప్రవర్తనకు జనం మూగారక్కడ.

"చూడండీ, సాటి అమ్మాయినన్న కన్సిడరేషనైనా లేదీమెకు. ఆ నెక్లెస్ బావుంది గదా అని, ఓసారి మెళ్ళో వేసుకుని చూసిస్తా నంటే ఇవ్వడం లేదు" అంటూ ఫిర్యాదు చేసింది.

"ప్లీజ్! మేరైనా చెప్పండీ ఓసారివ్వమని" అంటూ ప్రతి ఒక్కర్నీ బ్రతిమాలసాగింది. అంతా వింతగా చోద్యం చూడసాగారు. కొందరు ఆమె తరఫున, మరికొందరు అంజలి తరఫునా వకాల్తా పుచ్చుకున్నారు.

అంజలికి అంతా అయోమయంగా వుంది. ఆమెకు వేపకాయంత వెర్రేమైనా వుందా అనిపించింది. కోపంగా ఏదో అనబోయింది. అంతలోనే ఏదో ఫ్లాష్ వెలిగింది ఆమె బుర్రలో. ఆ యువతి డీసెంటుగా కనిపిస్తోంది. డీసెంటుగా వున్నవారెవరు అలా ప్రవర్తించరు. తప్పకుండా ఆమె వారం వారం తాను టీవీలో చూస్తున్న 'షో' ప్రోగ్రాంకి చెందినదే అయి వుండాలనుకుంది. అసలు ఎన్నోసార్లు అను కుంది తాను, ఆ ప్రోగ్రాంలో పార్టిసిపేట్ చేసే ఛాన్స్ తనకు తగిలితే బావుండునని. ఇప్పుడు ఆ అవకాశం ఆ విధంగా లభించిదన్నమాట. కెమేరా కోసం చూడబోయి ఆగిపోయింది. ఆ విషయం తనకు తెలిసిపోయి నట్లు వాళ్ళకు తెలిసిపోకూడదు. అప్పుడే త్రిల్లు.

'గేమ్' అర్థమయిపోవడంతో కాసేపు గొణిగింది అంజలి ఎక్కువసేపు కెమేరాలో కని పించాలని. తరువాత మెళ్ళోని నెక్లెస్ తీసి ఆ యువతికిచ్చింది. ఆ ప్రోగ్రాంలో తాను హీరో యిన్ అయినందుకు ఆనందంగా వుంది. ఆ తరువాత వాళ్ళడిగే ప్రశ్నకు జవాబులు ఎలా చెప్పాలో అప్పుడే ఆలోచించుకోసాగింది.

ఆ యువతి నెక్లెస్ మెళ్ళో పెట్టుకుని తన స్కూటర్ మిర్రర్‌లో చూసుకుంది మురిసి పోతూ. తరువాత అంజలితో "ఇది మెళ్ళో పెట్టుకుంటే గ్రాండ్‌గా ఫీలవుతున్నాను. నలు గురూ చూసేటట్టు ఓ రౌండ్ కొట్టి వస్తాను" అంటూ సమాధానానికి ఎదురు చూడకుండానే స్కూటర్ స్టార్ట్ చేసి తుర్రుమంది.

నవ్వుతూ చూస్తున్న అంజలి, ఆ యువతి ఎంతకూ వెనక్కి మళ్ళకుండా రోడ్డు చివర అదృశ్యమయిపోయేసరికి కంగారు పడింది. "బాబోయ్ నా నెక్లెస్" అంది భయంగా.

"ఫరవాలేదు, వచ్చేస్తుందిలే" అని కొందరంటే ఆ గుంపులోంచి ఓ వ్యక్తి ముందు కొచ్చి, "ఎందుకైనా మంచిది, ఆమె వెనుకే వెళ తాను. స్కూటరిలా ఇవ్వండి" అంటూ అంజలి జవాబిచ్చే లోపునే ఆమె స్కూటర్ తీసుకుని ఆ

# గురుదేవో మహేశ్వరః
# మీ సమస్యలకు పరిష్కారాలు

***ఈ సంవత్సరం నేను ఎం.ఎ చేయాలనుకుంటున్నాను. ఫస్ట్ క్లాస్ వస్తుందా? నా ప్రయత్నం ఫలిస్తుందా?***

***- ఎం. ఉష, తిరుపతి***

మీ ప్రయత్నం తప్పకుండా ఫలిస్తుంది. క్లాసు రావడానికి శ్రమ పడాల్సి వస్తుంది.

***నా పేరు రోజా. నాకు వివాహం అయ్యి 6 సం. 7 నెలలు. సంతాన ప్రాప్తి లేదు. తిరగని గుళ్ళు లేవు. ఆసుపత్రులు లేవు. కావున నాపై దయ వుంచి నాకు సంతానము కలుగునో, లేదో, కలిగితే ఎప్పుడో తెలియపరచ కోరుచున్నాను.***

***-శంభంగి రోజా, గుడివాడ***

గుళ్ళు చుట్టూ తిరిగినా ఫరవాలేదు. మనశ్శాంతి కలుగుతుంది. ఆస్పత్రుల చుట్టూ తిరగకండి ఉన్న మనీ పోతుంది. మీకు 27వ సంవత్సరం వచ్చే నాటికి తప్పకుండా మగ సంతానం కలుగుతుంది. ఆ తరువాత రెండు సంవత్సరాలకు ఆడ సంతానానికి అవకాశం ఉంది. భయపడాల్సిన పని లేదు.

***నేను ఎంతకాలం జీవిస్తాను? అనుకుంటే 40 ఏళ్ళకే చనిపోయే అవకాశం లేదా? ధ్యానం ద్వారా ముందుగానే మృత్యువును ఆహ్వానించేందుకు వీలవుతుందా?***

ఇటువంటి ప్రశ్నలు మీరు వేసుకోకూడదు. ఇంకొకరిని అడగకూడదు. జీవితాన్ని ఛాలెంజిగా తీసుకొని, ధైర్యంగా సమస్యల్ని పరిష్కరించుకోడానికి ప్రయత్నించాలి. పూర్తి చిరునామా రాయని వారి ప్రశ్నలకు సమాధానాలివ్వబడవు. (పేరు ప్రచురించ వద్దని కోరారు).

***నాకు వివాహం అవలేదు. నాకు ఇల్లు కట్టుకోవాలని ఉంది. కట్టుకుంటానా? నా భవిష్యత్తు ఎలా ఉన్నదో చెప్పవలెను.***

మీ ప్రశ్నకు ఇదివరకే సమాధానమివ్వడమైనది.

గమనిక : అడిగిన ప్రశ్ననే మళ్ళీ మళ్ళీ అడగరాదు. నక్షత్రం (ఎన్నో పాదమో) కూడా రాస్తే బాగుంటుంది. ఒకరు ఒక ప్రశ్నను మాత్రమే అడగాలి. కొన్ని సందర్భాల్లో ఏ ప్రశ్నకూ సమాధానం ఇవ్వకపోవచ్చు. పూర్తి అడ్రసు రాయని వారి ప్రశ్నలకు అసలు సమాధానాలివ్వబడవు. కేవలం జాతకాన్ని బట్టి మాత్రమే సమాధానాలివ్వడం లేదు. శివానుగ్రహమే శరణ్యం. నమ్మకమే ముఖ్యం. శుభమస్తు.

***ఈ శీర్షికకు ప్రశ్నలను పంపేవారు, తమ పేరు, చిరునామా, పుట్టిన తేదీ, సమయం, నక్షత్రం, నివసించే ప్రాంతం వివరంగా రాసి మాకు పంపండి. వారం వారం మీ ప్రశ్నలకు సమాధానాలు ప్రచురిస్తాం. - ఎడిటర్***

కొత్త శీర్షిక:

## కట్నం కోరని 'వరులు'

**ఆధునిక సమాజంలో, యువకులు అన్నిరంగాల్లోనూ ముందంజలో వున్నారు. అయినా వివాహ విషయంలో ఇంకా పట్టింపులు, పంతాలు, కట్నాలు, కానుకలంటూ దురాశకు బానిసలయి, జీవితాంతం తోడు నీడగా వుండాల్సిన అర్ధాంగి విషయంలో 'అర్థా'నికి అధిక ప్రాముఖ్యతనిచ్చి జీవితం అనర్థదాయకంగా మార్చుకుంటున్నారు.**

**అలాగాక ఆధునిక భావాలతో 'సర్వేజనా సుఖినోభవంతు' అన్న ఆదర్శం కలిగి, కట్నం ఆడంబరాలు అవసరం లేదనే యువకుల నుంచి మీ మనో భావాల వెల్లడికి వేదికగా ఈ శీర్షికను నిర్వహిస్తున్నాము. మీరు కట్నం లేకుండా ఆడంబరాలకు పోకుండా వివాహమాడదలిస్తే మీ పూర్తి వివరాలను (పుట్టిన తేదీ, ఊరు, నక్షత్రం, ఉద్యోగం తదితర వివరాలతో) మీ ఫోటో జత పర్చి పంపండి. మీరు ఎలాంటి కన్యను కోరుతున్నారో కూడా తెలియపర్చండి.**

**వారం, వారం 'ప్రియదత్త' వారపత్రికలో ప్రచురిస్తాము. - ఎడిటర్**

యువతి వెళ్ళిన దిక్కే వెళ్ళాడు వేగంగా.

అరగంట దాటింది. నెక్లెస్ తీసుకెళ్ళిన యువతిగానీ, స్కూటీలో వెళ్ళిన వ్యక్తిగానీ జాడ లేదు. జరిగిందంతా మోసమని, అది టీవీ షో కాదనీ తేలిపోయింది. అంజలికి దుఃఖం ముంచుకొచ్చింది. అక్కడే ఏడ్చేసింది.


ఆమె స్థితికి జాలిపడి కన్సర్న్డ్ ఛానెల్‌ని కాంటాక్ట్ చేశారెవరో. అసలు ఆ రోజు తాము నగరంలో ఏ ప్రోగ్రామూ సూట్ చేయలేదని చెప్పారు వాళ్ళు. తాను డ్యూప్ చేయబడ్డట్టు నిర్ధారణ కావడంతో ఏడుస్తూ ఆటో ఎక్కి ఇంటిముఖం పట్టింది అంజలి.

భయమూ, దుఃఖమూ ముప్పిరిగొనగా బెరుకుగా ఇంట్లో అడుగుపెట్టిన అంజలికి, వాతావరణంలో ఏదో మార్పు కనిపించింది. సన్‌డే రోజున వోవర్‌టైమ్ చేసే టీవీ సైలెంటుగా వుంది. హాల్లో తల్లీ, తండ్రీ దిగాలుగా కూర్చున్నారు. తమ్ముడు కూడా అరచేతుల్లో తలపెట్టుకుని కూర్చున్నాడు. కొంపదీసి తాను నెక్లెసూ, స్కూటీ పోగొట్టుకున్న వార్త నాకంటే ముందే ఇల్లు చేరిందా ఏమిటీ? అనుకుంది.

కూతుర్ని చూడగానే కావలించుకుని భోరు మంది పరిమళం. అంజలి కూడా ఏడ్చేసింది.

తల్లి హఠాత్తుగా ఏడ్పు ఆపి, "నువ్వెందుకు ఏడుస్తున్నావ్?" అనడిగింది కూతుర్ని. "నువ్వేడుస్తున్నావని" అంది కూతురు.

"టీవీ వాళ్ళమంటే నమ్మాం. సీరియల్ షూటింగంటే ఇల్లప్పగించాం. దొంగ సచ్చి నోళ్ళు మమ్మల్ని హాల్లో కూర్చోబెట్టి లాకర్‌లోని నగలూ, డబ్బూ, దోచుకుపోయారే తల్లీ" అంటూ మళ్ళీ కూతుర్ని కావలించుకుని భోరుమంది పరిమళం.




"ఆ ఛానెల్‌కి ఫోన్ చేస్తే తామెవర్నీ పంప లేదన్నారు. వచ్చినవాళ్ళు మోసగాళ్లని తెలి పోయింది" అన్నాడు చలపతి. అతని ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు.

తల్లితో శ్రుతి కలిపింది అంజలి. చల్లగా తనకు జరిగిన పరాభవం గూర్చి కూడా చెప్పింది. దాంతో ఏడుపు స్థాయి, డ్యూరేషనూ కూడా పెరిగాయి.

చలపతికి పిచ్చెక్కిపోయింది. "చూశారుగా మీ టీవీ పిచ్చి పర్యవసానం. మరోసారి సీరియల్సూ, ప్రోగ్రామ్సూ అన్నారంటే ఆ సెట్‌తో పాటు మిమ్మల్ని కూడా ఎత్తి మురిక్కాలవలోకి విసిరేస్తాను" అంటూ తల్లీ కూతుళ్ళ మీద అరిచాడు. ఇంకస్సేపు అరవాలనుకున్నాడు. కానీ, ఓపిక లేక వూరుకున్నాడు. ఆ మోస గాళ్ళ పుణ్యమా అంటూ ఆ పూట వంట కూడా చేసుకోలేదు మరి. కడుపులో ఎలుకలు స్పెషల్ ప్రోగ్రాం పెట్టుకున్నాయి.

"బుద్ధి వచ్చిందండీ!" అంటూ చెంపలు వేసుకుంది పరిమళం. పనిలో పనిగా కూతురి చెంపలు కూడా వాయించింది. ఎందుకైనా మంచిదని కాబోలు, కిరణ్ దూరంగా పారి పోయాడు.

అదే సమయంలో –

డోర్ బెల్ మోగింది. కిరణ్ వెళ్ళి తలుపు తెరిచాడు.

గుమ్మంలో ఇద్దరు పురుషులు, ఓ యువ తీను. వారి చేతుల్లో వీడియో కెమేరా, హ్యాండ్ మైక్ వగైరాలు.

"మేం టీవీ ఛానెల్ నుండి వస్తున్నాం". అన్నారు వాళ్ళు. "ఓ ఫ్యామిలీ ప్రోగ్రాం చేస్తు న్నాం. అందులో మిమ్మల్ని ఫీచర్ చేయాలని.."

వారి పలుకులు పూర్తి కాకుండానే వారి పైకి లంఘించాడు చలపతి. "గెటౌట్" అంటూ అరవబోయాడు.

అయితే –

అతన్ని పట్టుకుని నోరు నొక్కేశారు పరిమళం, అంజలిలు. కుర్చీకి కట్టేసారతన్ని.

తరువాత ముఖాల నిండా కామెడి యన్సులా నవ్వులు పులుముకుని, "ప్లీజ్ కమిన్" అంటూ ఆగంతకులకు స్వాగతం పలి కారు హడావుడిగా.

అది చూసిన చలపతి 'ఆ' అంటూ షాక్‌లో అలవాటు ప్రకారం కసిగా జుట్టు పీక్కోబోయాడు. బోడిగుండు చేతికి తగిలింది నున్నగా. *